క్లుప్తంగా

పద్మావతమ్మ ఆరాధన



ప్రత్యేక అలంకరణలో పద్మావతమ్మ

ప్రొద్దుటూరు : మండలంలోని ఉప్పరపల్లెలోని సద్గురు సమర్థ నారాయణాశ్రమంలో పద్మావతమ్మ ఆరాధన మహోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్‌చాలీసా పారాయణం, రామనామ జపం, భజన, దాసబోధ పారాయణం, రుద్రాభిషేకం, గోపూజ, మహా నివేదన, మంగళ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆశ్రమాధిపతి గోపాలస్వామి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధులకు భోజనం వడ్డిస్తున్న దాతలు

ప్రొద్దుటూరు : స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో వృద్ధులకు బద్వేలి శివశంకర్‌రెడ్డి, డాక్టర్ బద్వేలి శివప్రసాద్‌రెడ్డి గురువారం అన్నదానం చేశబూరు. వారి తండ్రి బద్వేలి మునిరెడ్డి తృతీయ వర్ధంతి సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ వృద్ధులు ప్రశాంత జీవనం గడపాలని, వారికి అందరూ సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు సుబ్బరాయుడు, మేనేజర్ రఘురామ్ పాల్గొన్నారు.

డిసెంబరు 4న చలో ఢిల్లీ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరయ్య

పోరుమామిళ్ల : దళిత హక్కులు, సామాజిక న్యాయం పరిరక్షించాలని కోరుతూ డిసెంబర్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం ఇచ్చేందుకు తలపెట్టిన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వీరయ్య కోరారు. గురువారం చలో ఢిల్లీ కార్యక్రమం పోస్టర్‌ను అంబేద్కర్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రత్నమయ్య, నరసింహులు, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయం తనిఖీ



మాట్లాడుతున్న జేసీ గణేష్ కుమార్

బ్రహ్మంగారిమఠం : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయాన్ని గురువారం జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో పలు రికార్డులను పరిశీలించారు. పట్టాదారు పాసుపుస్తకాల నమోదు, మంజూరు, ఆన్‌లైన్ నమోదును తనిఖీ చేశారు. ఇదే క్రమంలో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రెవెన్యూ పరమైన సేవలను అందించాలని సూచించారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



యంత్రాన్ని పరిశీలిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జయదేవ్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని ఎరువుల దుకాణాలు, చౌకబియ్యం పంపిణీ చేసే ఎండీయూ యూనిట్లలో లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ జయదేవ్ గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కొలతల్లో వ్యత్యాసం రావడంతో నాలుగు కేసులు నమోదు చేశారు. ట్రేడర్స్ అంతా తప్పకుండా తూకాల యంత్రాలకు స్టాంపింగ్ చేయించుకోవాలని సూచించారు.

చేతిరాతపై ఉచిత శిక్షణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అరవిందాశ్రమంలోని ఎస్ఎం స్కిల్ హబ్‌లో విద్యార్థులకు ఉచితంగా చేతిరాతపై శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకురాలు మౌనిక ఓ ప్రకటనలో తెలిపారు. రోజూ ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు శిక్షణ తరగుతులుటాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9502890722 నంబర్‌కు సంప్రదించాలని తెలిపారు.

గ్రామీణ యువతకు శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ గ్రామీణ యువతకు డ్రోన్ సర్వీస్ టెక్నీషియన్ కోర్సులో నాలుగు నెలలపాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని అడ్మిషన్ కో ఆర్డినేటర్ హరిప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. 19–28 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి టెన్త్ ఉత్తీర్ణులై డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా పాస్/ఫెయిలైన నిరుద్యోగులు శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. ఈ నెల 30వ తేదీన కడప రామకృష్ణ హైస్కూల్‌లో శిక్షణ ప్రారంభమవుతుందన్నారు.

28న సామాజిక సాధికార బస్సు యాత్ర

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరిగిందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. స్థానిక పుట్టపర్తి కూడలిలో బస్సు యాత్రకు సంబంధించిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణానికి నడిబొడ్డున ఉన్న పుట్టపర్తి కూడలి సభకు అనుకూలంగా ఉంటుందని నిర్ణయించామన్నారు. ఈ నెల 28న శనివారం మధ్యాహ్నం వైవీఆర్ కల్యాణ మండపంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం రామేశ్వరం నుంచి బస్సు యాత్ర బయల్దేరుతుందన్నారు. రామేశ్వరం, నాలుగు రోడ్ల కూడలి, వన్ టౌన్ సర్కిల్, విజయకుమార్ సర్కిల్, రాజీవ్ సర్కిల్ మీదుగా సాయంత్రం 5 గంటలకు పుట్టపర్తి సర్కిల్‌కు చేరుకుంటుందున్నారు. ఇక్కడ నిర్వహించే బహిరంగ సభకు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా, కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్, తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్ రావు, మాజీ ఎంపీ బుట్టా రేణుక హాజరవుతారన్నారు. ఇప్పటి వరకు గడిచిన ప్రభుత్వాలు ఏవీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేయలేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే న్యాయం జరిగిందన్నారు. వారికి రాజ్యాధికారం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్‌మిల్ ఖాజా, ఏపీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పన్నీటి కాశయ్య, సగర కార్పొరేషన్ డైరెక్టర్ ఉప్పర మురళీ, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిసెట్టి బాబు, రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, గోపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగ శేషారెడ్డి, కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, మార్కెట్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.



రాజుపాళెం: టంగుటూరులోని సచివాలయ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు, అధికారులు

నాయీ బ్రాహ్మణులంతా హాజరుకావాలి

ప్రొద్దుటూరు: ఈ నెల 28న ప్రొద్దుటూరులో జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రకు నాయీబ్రాహ్మణులంతా హాజరవుతారని ఏపీ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి సభ్యుడు సిద్ధవటం యానాదయ్య తెలిపారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని గురువారం కలిసి మాట్లాడారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా నాయీబ్రాహ్మణులతోపాటు ఇతర బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు అండగా నిలిచిందన్నారు. బడుగు, బలహీన వర్గాల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి వారి సామాజిక అభివృద్ధికి తోడ్పడిందన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు ఎం.గురప్ప, కిశోర్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ వ్యాపారుల మద్దతు

ఈ నెల 28న జరిగే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు మద్దతు ఇస్తున్నట్లు కూరగాయల మార్కెట్ వ్యాపారుల సంఘం ప్రతినిధులు తెలిపారు. మార్కెట్‌లో సంఘం గౌరవాధ్యక్షుడు ఆర్.అహ్మద్‌హుస్సేన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యదర్శి ఎస్.ఖాసీం మాట్లాడుతూ బస్సు యాత్రకు మార్కెట్‌లోని వ్యాపారులందరూ హాజరు కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ ప్రభుత్వం ముఖ్యంగా పేదల కోసమే పనిచేసిందన్నారు. ఈ సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు వలీబాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ దాదాపీర్, గౌరవాధ్యక్షుడు జాఫర్ హుస్సేన్, ఉపాధ్యక్షుడు షబ్బీర్, వేణు గోపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ కలల స్వరాజ్యం జగన్‌తోనే సాధ్యం

రాజుపాళెం : గాంధీజీ కలలు కన్న స్వరాజ్యం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని టంగుటూరులో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని ముడియం గౌతంరెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని శాఖలను గ్రామంలోకే తీసుకొచ్చి ప్రజలకు మంచి పరిపాలన అందించేలా చేశారన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ధనిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎల్లు మహేష్ రెడ్డి, ముక్కర్ల నరసింహారెడ్డి, బాలయ్యలు గురువారం టీడీపీ నుంచి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నారాయణ రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు.

రూ.50 వేల వితరణ

వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు గౌతం రెడ్డి పలువురికి గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఆటో కొనేందుకు డబ్బు లేక ఇబ్బంది పడుతున్న మానుకింది హుసేనయ్యకు ఎమ్మెల్యే రాచమల్లు చేతులమీదుగా సొంత నగదు రూ.50 వేలు అందజేశారు. గ్రామాన్ని శుభ్రం చేసే గ్రీన్ అంబాసిడర్లు, ఆశాలు, ఆయాలకు సొంతంగా చీరలను పంపిణీ చేశారు. యువతి వెలవలి లక్ష్మీ వివాహం కోసం రూ.30 వేల నగదు, చీర తాళిబొట్టు అందజేశారు. జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు రూ.25విలువ చేసే మాస్కోఫాస్ట్ యూనిఫాం అందించారు. ఎమ్మెల్యే రాచమల్లు మాట్లాడుతూ గౌతంలో సేవ చేసే ఆలోచనలున్నాయని అన్నారు. రాష్ట్ర అదరపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఎంపీపీ సలోమి, జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, మండల కన్వీనర్ రాజారాం రెడ్డి, సర్పంచ్ బాబు, ఎంపీడీఓ వెంకట రెడ్డి, పీఆర్ డీఈ మల్లేశ్వర రెడ్డి, గోనా వెంకటసుబ్బారెడ్డి, గోనా రఘునాథరెడ్డి, ఇమ్మారెడ్డి, నరసింహారెడ్డి, నవనీధర్ రెడ్డి, రాములపల్లి దస్తగిరి పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీఓ హోంలో శనివారం ఉదయం 10–30 గంటలకు మండల పరిషత్ అధ్యక్షురాలు బిజివేముల రమణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నూర్జహాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ అంశాలపై చర్చించే ఈ సమావేశానికి జెడ్పీటీసీతో పాటు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యులు, ఆయాశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

చాపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య అధ్యక్షతన జరుగనున్న సమావేశానికి ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అన్ని శాఖల అధికారులు నివేదికలతో, మండలంలోని అన్ని పంచాయతీల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు హాజరుకావాలని ఎంపీడీఓ కోరారు.

పంట నమోదుపై గ్రామసభలు

బి.కోడూరు : మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాలో ఖరీఫ్–2023కు సంబంధించి పంట నమోదుపై సామాజిక తనిఖీ, గ్రామసభలు నిర్వహిస్తామని మండల వ్యవసాయాధికారి టి.కౌశిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పంట నమోదు జాబితాను నేటి నుంచి 29వ తేదీ వరకు ఆర్బీకేలలో సామాజిక తనిఖీ కోసం ప్రదర్శిస్తామన్నారు. రైతులు, ప్రజాప్రతినిధులు గ్రామసభలకు హాజరై పంట నమోదు జాబితాను పరిశీలించి ఏవైనా తప్పులు ఉంటే రాతపూర్వకంగా అర్జీ ఇస్తే మీ అర్జీ ఆధారంగా వివరాలను పరిశీలించి సరి చేస్తామని తెలిపారు.

పంటకు విత్తనమే మూలాధారం

ప్రొద్దుటూరు: రైతులు పండించే పంటకు విత్తనమే మూలాధారమని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరయ్య తెలిపారు. మండలంలోని కల్లూరు గ్రామంలోని ముమ్మడిరెడ్డి నరేంద్రరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో రైతులకు విత్తనోత్పత్తిపై గురువారం ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శాస్త్రవేత్త వీరయ్య మాట్లాడుతూ రైతులు నాణ్యమైన విత్తనాలను ఎన్నుకోవాలని సూచించారు. పాతకాలం విత్తనాలను సాగు చేయడంతోపాటు శాస్త్రవేత్తలు కొత్తగా కనిపెట్టిన విత్తనాలు వాడాలన్నారు. ఈ సమావేశానికి వివిధ ప్రాంతాల రైతు సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రమణారెడ్డి, డీఏఎం విజయవిహారి, ఏవో శివశంకర్‌రెడ్డి, ఆదినారాయణ, రవితేజ, ధనుష్‌రెడ్డి, శివశైలజ, పవన్ కుమార్, అభిషేకం తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వీరయ్య

పాలనా భాషగా తెలుగు అమలు తప్పనిసరి

చాపాడు : ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగు అమలు తీరును పరిశీలించి తప్పనిసరిగా అధికార భాషగా తెలుగును అమలు పరచాలని ఏపీ అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు తవ్వా వెంకటయ్య సూచించారు. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో తెలుగులో అమలు పరచాలని సదుద్దేశ్యంతో అధికార భాషా సంఘం అధ్యక్షులు ఇ.విజయబాబు జిల్లాల సమీక్షలు జరుపుతున్నారన్నారు. ఆయన ఆదేశాల ప్రకారం అధికార భాషా సంఘం రాష్ట్ర సభ్యులు తమకు అప్పగించిన జిల్లాలో క్షేత్రస్థాయి సమీక్షలు జరుగుతున్నాయన్నారు. చాపాడులోని పోలీసు స్టేషన్, మండల అభివృద్ధి కార్యాలయం, రెవెన్యూ కార్యాలయం, పల్లవోలు, మడూరు, అన్నవరం గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. 70 శాతం పైగా పాలనా భాషగా తెలుగు అమలు జరుగుతున్నందుకు సంతోషం వ్యక్తం చేసి అధికారులను అభినందించారు. కార్యక్రమంలో తహసీల్దారు యామిని, ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు, ఏఎస్ఐ శంకరయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అధికార భాష సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య

ప్రజాభీష్టం మేరకే రోడ్డు నిర్మాణ పనులు

బద్వేలు అర్బన్ : మెజార్టీ ప్రజల అభిప్రాయం మేరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డులోని సుమిత్రానగర్‌లో అర్ధాంతరంగా ఆగిన రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. రోడ్డు పనులు నిలిచిపోవడానికి గల కారణాలను మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సూచించిన కొలతల మేరకే పనులు ప్రారంభించాలని, మిగిలిన ప్రజలను ఇబ్బందులకు గురి చేయవద్దని అధికారులకు సూచించారు. ఒకరిద్దరి స్వలాభం కోసం కొలతలు మార్చాలని పనులు అడ్డుకోవడం తగదని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, కౌన్సిలర్ దుద్దుకూరుసత్యనారాయణ, వార్డు ఇన్‌చార్జిలు మౌలాలి, ప్రతాప్‌కుమార్, షఫి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు సమస్యను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్ రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గోపవరం : అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజ పేర్కొన్నారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బందితో అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణ పనులు డిసెంబర్ చివరి లోపల పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు నిర్మిస్తున్న ఏజెన్సీ నిర్వాహకులు లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేలా చూడాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నామని, అవి కూడా వేగవంతం చేయాలన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా రబీలో ఎలాంటి పంటలు సాగుకు నోచుకోలేదని, వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి త్వరితగతిన పూర్తి చేసేలా విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. సమావేశంలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హసీనా తదితరులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజ

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక గీతాశ్రమంలోని విద్యా సంస్థల్లో చదువుకొంటున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో గీతాశ్రమ ఈఓ, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శంకర్ బాలాజీ విఫలమయ్యారని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి అంగన్న తెలిపారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గురువారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ్రమంలో ఎన్నో విద్యాసంస్థలున్నాయని, రూ.18.5 లక్షలతో విద్యార్థుల కోసం 10 మరుగుదొడ్లను నిర్మించారన్నారు. ఒకటిన్నర సంవత్సరం కాకముందే అవి శిథిలావస్థకు చేరుకున్నాయని, డోర్లు సరిగా లేవన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ చొరవ చూపాలని కోరారు. పీడీఎస్‌యూ నాయకులు యశ్వంత్, మల్లికార్జునరెడ్డి, బాలాజీ, విష్ణు, చంద్ర, నరేష్, కరీముల్లా పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

లైంగిక వేధింపుల సంరక్షణపై అవగాహన

మైదుకూరు : లైంగిక వేధింపుల సంరక్షణపై చిన్నతనం నుంచి తల్లిదండ్రులు పిల్లల్లో అవగాహన కల్పించాలని అర్బన్ సీఐ ఏపీ మస్తాన్ అన్నారు. మైదుకూరు జెడ్పీ హైస్కూల్(బాయ్స్)లో గురువారం పోలీసు శాఖ ఆధ్వర్యంలో 'లైంగిక వేధింపుల నుంచి స్త్రీలు, పిల్లల రక్షణ – సమాజ పాత్ర'అనే అంశంపై 9, 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ సీఐ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం లైంగిక వేధింపులను అరికట్టేందుకు అనేక చర్యలు తీసుకుంటోందన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తూ ఫోక్సో చట్టం కింద కేసులు నమోదు చేస్తోందని పేర్కొన్నారు. పనిచేసే చోట, కళాశాలల్లో, బస్టాండ్, రహదారుల్లో, ఎక్కడైనా తమకు లైంగిక వేధింపులు ఎదురైతే దిశ యాప్‌ను వినియోగించి బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. లైంగిక వేధింపులపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించేందుకు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు జిల్లా స్థాయి పోటీలకు హాజరవుతారన్నారు. ఎంఈఓ పద్మలత మాట్లాడుతూ లైంగిక వేధింపుల పట్ల విద్యార్థులు అవగాహనతో మెలగాలని సూచించారు. పోటీలకు ఉపాధ్యాయులు తవ్వా ఓబుళరెడ్డి, ఎ.శ్రీనివాసులు, సాదక్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. ఎంఈఓ –2 నరహరిశర్మ, అర్బన్ ఎస్ఐ ఘన మద్దిలేటి, పాఠశాల ఇన్‌చార్జి హెడ్మాస్టర్ మణిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అర్బన్ సీఐ ఏపీ మస్తాన్

విజేతలు వీరే..

ఉపన్యాస పోటీలో మొదటి స్థానం కె.హస్సిరా (9వతరగతి, సెయింట్ ఆల్ఫోన్స్ లిగోరి హైస్కూల్), రెండో స్థానంలో ఎస్.స్వరూప (బీఎస్సీ రెండో సంవత్సరం, ప్రభుత్వ డిగ్రీకళాశాల), మూడో స్థానంలో ఎస్.హర్షియ(9వ తరగతి, వాంతినికేతన్) నిలిచారు. వ్యాసరచన పోటీలో మొదటి స్థానం టి.నాగజ్యోత్స్న (9వ తరగతి, సెయింట్ ఆల్ఫోన్స్ లిగోరి హైస్కూల్) రెండో స్థానంలో యు.జస్మిత (పదో తరగతి శాంతినికేతన్ హైస్కూల్), మూడో స్థానం ఎస్.రోహిత్ కుమార్ (పదోతరగతి జెడ్పీ బాయ్స్ హైస్కూల్) సాధించారు.

మహిళలు పొదుపు రుణం సద్వినియోగం చేసుకోవాలి

బి.కోడూరు: మహిళలు స్వయం శక్తితో పొదుపు రుణం సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం సీతారామిరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక స్త్రీశక్తిభవనంలో నిర్వహించిన మండల సమాఖ్య సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాల ద్వారా జీవనోపాధారాలు, అంతర్గత అప్పులు తీరుతాయని తెలిపారు. శ్రీనిధి ద్వారా తీసుకున్న డబ్బులు సకాలంలో బ్యాంకులకు చెల్లించాలన్నారు. ప్రధానమంత్రి బీమా గురించి సమాఖ్య సభ్యులకు అవగాహన కల్పించారు. తల్లిదండ్రులు బలవంతంగా ఆడపిల్లలకు 18 సంవత్సరాలలోపు వివాహాలు చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీలు వెంకటయ్య, రత్నమ్మ, పీటర్, ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద బాధితులకు పరామర్శ

ప్రొద్దుటూరు క్రైం : రాజుపాళెం మండలం కొర్రపాడు సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బంగ్లా అల్తాఫ్, నంద్యాల మస్తాన్‌ల కుటుంబీకులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం పరామర్శించారు. ఈ కార్యక్రమంలో రాజారాంరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, వెలవలి శేఖర్ రెడ్డి, మాబు షరీఫ్, ఆయిల్ మిల్ ఖాజా, పోరెడ్డి నరసింహారెడ్డి, ఓబుళరెడ్డి పాల్గొన్నారు.

ఆర్బీకేలలో ఖరీఫ్ పంటల సాగు వివరాలు

చాపాడు: మండల వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌లో సాగైన పంటల వివరాలను గురువారం నుంచి రైతు భరోసా కేంద్రాలలోని నోటీసు బోర్డులో అందుబాటులో ఉంటాయని మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. అన్ని రైతు భరోసా కేంద్రాలలో సామాజిక గ్రామ సభలు నిర్వహించటం జరుగుతుందన్నారు. ఆర్బీకేలలో ప్రదర్శించిన జాబితాలలో రైతులు పరిశీలించి, అభ్యంతరాలు ఉంటే వీఏఏలను సంప్రదించి తప్పులు సరిదిద్దుకోవాలన్నారు. పంట రకం, విస్తీర్ణం తదితర వివరాలలో జాబితా అందుబాటులో ఉంటుందన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం కంట్రోల్ ఆఫ్ ఎలక్ట్రిక్ మోటార్ డ్రైవ్ ఫర్ ఎలక్ట్రికల్ వెహికల్ అప్లికేషన్ అనే అంశంపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. వరంగల్ ఎన్ఐటీ ప్రొఫెసర్ వినయ్ కుమార్ అంశంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ పాండురంగన్ రవి, కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వర రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తులను పరిరక్షిస్తాం

ప్రొద్దుటూరు కల్చరల్ : జిల్లాలో వక్ఫ్ బోర్డు ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తానని వక్ఫ్ బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి తెలిపారు. మన ప్రజా సేవా సమితి కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అన్యాక్రాంతమైన వక్ఫ్ బోర్డు ఆస్తులను అధికారులతో మాట్లాడి తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. అనంతరం వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీనా దస్తగిరి, సర్పంచ్ గౌస్ లాజం, వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం రాష్ట్ర కార్యదర్శి యాకూబ్‌లకు శాలువా కప్పి మెమెంటోలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్, గౌరవాధ్యక్షుడు అరబ్‌సా, ఉపాధ్యక్షుడు సలీం, కోశాధికారి మహమూద్, ఎంపీజే రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీం, ఇన్ఫోటిక్ టూర్ అండ్ ట్రావెల్ అధినేత షేక్షావలి, అల్లాబకాష్, షరీఫ్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.



వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ మదీన దస్తగిరిని సన్మానిస్తున్న మన ప్రజా సేవా సమితి సభ్యులు

వరిలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

అట్లూరు : వరిపంటలో సస్యరక్షణ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి జి.రామక్రిష్ణయ్య తెలిపారు. గురువారం మండలంలోని తంబళ్లగొంది రైతుభరోసా కేంద్రం పరిధిలోని వరిపంటను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలో దోమపోటు, సుడిదోమ ఎక్కువగా ఆశించిందన్నారు. ఆశించిన పొలంలో దోమలు మొక్క కాండం భాగం నుండి రసాన్ని పీల్చడం వలన పొలంలో పైరు సుడులు సుడులుగా ఎండిపోవడం జరుగుతుందని తెలిపారు. దీని నివారణకు ఇథోఫెన్‌ప్రాక్స్ 400 మిల్లీలీటర్లు ఒక ఎకరాకు లేక డైనోటెప్యూరాన్ 80 గ్రాములు ఒక ఎకరాకు లేక పైమెట్రోజిన్ 120 గ్రాములు ఎకరాకు చొప్పున మొక్కల మొదళ్ళు తడిచేలా పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

బి.కోడూరులో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం


బి.కోడూరు : నాబార్డు వారి సౌజన్యంతో బి.కోడూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వారి ఆధ్వర్యంలో కళాసేన రూరల్ మీడియా బృందంతో గురువారం బి.కోడూరు వెలుగు కార్యాలయంలో ఆర్థిక, సాంకేతిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ప్రధానమంత్రి బీమా పథకాలు కలిగి ఉండాలని, సహజ మరణం, ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినప్పుడు కుటుంబానికి రూ.2 లక్షలు వర్తిస్తాయని వివరించారు. పొదుపు గ్రూపు రుణాలు సకాలంలో చెల్లించి ప్రభుత్వం అందించే వడ్డీలేని రుణాలకు అర్హత పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం సీతారామిరెడ్డి, బ్యాంకు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 1న పంటల నమోదుపై తుది జాబితా

మైదుకూరు : మండలంలోని రైతులు ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదుపై నవంబర్ ఒకటో తేదీన తుది జాబితా వెలువరిస్తామని మండల వ్యవసాయాధికారి పి.లక్ష్మీప్రసన్న తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు రైతులు సాగు చేసిన పంటల నమోదు జాబితాలను రైతు భరోసా కేంద్రాల్లో, మున్సిపాలిటీలో ప్రదర్శించినట్టు ఆమె పేర్కొన్నారు. ఈ జాబితాను రైతులు, ప్రజా ప్రతినిధులు పరిశీలించి పంటల వివరాలు, సర్వే నంబర్లను సరి చూసుకోవాలన్నారు ఏవైనా అభ్యంతరాలు, అభ్యర్థనలు తెలియజేసేందుకు గురువారం నుంచి గ్రామ సభలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గురువారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు పంటల నమోదుపై అభ్యంతరాలు, అభ్యర్థనలను రైతు భరోసా కేంద్రాల్లో తెలియజేయాలని సూచించారు.

ల్యాబ్‌లు లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించని కార్పొరేట్, ప్రైవేటు కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు డిమాండ్ చేశారు. ఇంటర్ ఆర్ఐవో రమణరాజును గురువారం కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఆయన మాట్లాడుతూ కడప నగరంతోపాటు ప్రొద్దుటూరు, బద్వేల్, మైదుకూరు, పులివెందుల ప్రాంతాల్లో కార్పొరేట్, ప్రైవేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు వేలాది రుపాయల ఫీజులు వసూలు చేస్తున్నా విద్యార్థులకు ల్యాబ్ సౌకర్యం కల్పించడం లేదని ఆరోపించారు. ఆర్ఐవో సంబంధిత కళాశాలలను తనిఖీ చేసి ల్యాబ్ సౌకర్యం లేని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు చరణ్, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఐవో రమణరాజుకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు